సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్‌నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట


వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


ఆరోగ్యసురక్ష శిబిరంలో రోగులకు కేస్‌షీట్లు అందజేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

- నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన

మద్దిపాలెం: రాష్ట్రంలోని ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు పేర్కొన్నారు. జీవీఎంసీ 53వ వార్డు మద్దిపాలెం శివనగర్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, వారి సంపూర్ణ ఆరోగ్యం కోసమే ఆరోగ్య సురక్ష శిబిరాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకంలో పలు వ్యాధులను చేర్చారని గుర్తు చేశారు. అనంతరం 53, 54వార్డుల ప్రజలకు వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్ వంటి పలురకాల పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ ఆలీ, జేసీఎస్ మండల కన్వీనర్ వసంత అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిరంజీవి, కె.చిన్నా, జ్ఞానేష్, నరసింగరావు, ఎస్.కృష్ణ, వెంకటేష్, ఈశ్వరరావు, అప్పలరెడ్డి, కృష్ణ, జోనల్ అధికారులు, పారామెడికల్ సిబ్బంది, సచివాలయం కార్యదర్శులు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఆరోగ్య భరోసా

సీతంపేట: జీవీఎంసీ 45వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో 253 సచివాలయం కొండవాలు ప్రాంతానికి సంబంధించిన ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా హనోక్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించి తగిన వైద్య సదుపాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుదీర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

558 మందికి వైద్య సేవలు

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తోందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. జోన్–5 పరిధి జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం పరిధి సంజీవయ్యకాలనీ సచివాలయానికి సంబంధించి అతిథి కమ్యూనిటీ హాల్‌లో


కేస్‌షీట్, మందులు అందజేస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్

సంజీవయ్యనగర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో గురువారం జరిగిన ×జగనన్న ఆరోగ్య సురక్ష÷ వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సతీష్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సుమారు 558 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ డాక్టర్ హర్షిణి తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్ కుమార్, నాయకులు దూది నర్సింగరావు, కృష్ణ, ఈశ్వరరావు, లావణ్య, అప్పలరెడ్డి, దుర్గాభవాని, శ్రీను, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● సీఎంను కలిసిన కేకే రాజు



విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మధురవాడలోని ఐటీ హిల్స్ హెలిప్యాడ్ వద్ద నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

–సీతమ్మధార

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం పాలన


బ్రోచర్ అందజేస్తున్న సమన్వయకర్త కేకే రాజు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర పాలన సాగుతోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాణ్యమైన పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు రెల్లివీధి–1 ససచివాలయం పరిధిలో శాంతిపురంలో గురువారం జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా వివిధ సంక్షేమ పథకాలు నిజాయతీగా, నిష్పక్షపాతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందించడమే కాకుండా మౌలిక వసతులు అభివృద్ధి పరిచే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, మువ్వల సంతోష్, హరి, అశోక్, అప్పన్న, గౌరునాయుడు, కొండలరావు, సన్నీ, జయ, పద్మ, సంధ్య, శ్రీను, శ్రావణ్ జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు


టీపీటీ కాలనీలోని ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త


వ్యర్థాలతో నిండిపోయిన డ్రైనేజ

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారు, టీపీటీ కాలనీతోపాటు పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శమిస్తున్నాయి. దీంతో దుర్వాసనతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే డ్రైనేజీల్లో ప్లాస్టిక్ బాటిల్స్, వ్యర్థాలతో నిండిపోయాయి. శానిటరీ అధికారులు కనీసం స్పందించడం లేదని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు దీనిపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

నాక్ మెచ్చేలా.. ఏయూ ముస్తాబు


రంగులు అద్దిన వర్సిటీ ప్రవేశ ద్వారం

ఏయూ క్యాంపస్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) పీర్ కమిటీ పర్యటనకు ఏయూ ముస్తాబవుతోంది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఆరుగురు సభ్యుల కమిటీ బృందం ఏయూలో పర్యటించనుంది. కమిటీ పర్యటనకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే వర్సిటీలో ప్రతి విభాగాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కమిటీ మూడు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ శుక్రవారం ఖరారు కానుంది. ప్రతి విభాగాన్ని కమిటీ సభ్యులు సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో తదనుగుణంగా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇప్పటికే విభాగాల వారీగా అవసరమైన మౌలిక వసతులు కల్పన పూర్తి చేశారు. సుందరీకరణ పనులు సైతం తుది దశకు వచ్చాయి.

అధికారుల నిరంతర పర్యవేక్షణ

కమిటీ సభ్యులు పరిశీలించే ప్రధాన విభాగాలు, కళాశాలలను ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దారు. విభాగాలకు వెళ్లే మార్గాలు, ఫుట్‌పాత్‌లను ఆకర్షణీయంగా తయారు చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం, ర్యాగింగ్ నిషేధం, దిశ చట్టంపై అవగాహన తదితర అంశాలపై తయారు చేసిన ప్రత్యేక సైన్ బోర్డులను వర్సిటీలో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. పారిశుధ్య సిబ్బంది నిరంతరం వర్సిటీలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించడం, రహదారులను శుభ్రం చేయడం చేస్తున్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రతి విభాగాన్ని ఇప్పటికే పలుమార్లు సందర్శించారు. అవసరమైన సూచనలు చేస్తూ పనులు పూర్తి చేశారు. నాక్ కమిటీ సభ్యులు సందర్శనకు వచ్చే సమయంలో తమ విభాగ ప్రగతిని ఆయా విభాగాధిపతులు వివరించాలని సూచించారు. గతంలో కంటే మెరుగైన ర్యాంక్ ఏయూ సాధించే లక్ష్యంగా అధికారులు ఎంతో శ్రమిస్తున్నారు. ప్రస్తుతం లభించే ర్యాంక్ రానున్న ఆరు సంవత్సరాలకు దోహదపడనుంది. శతాబ్ది వేడుకలకు చేరువవుతున్న ఏయూ మెరుగైన ర్యాంక్ సాధించాలని అంతా ఆకాంక్షిద్దాం.

క్లుప్తంగా

శంకరమఠంలో అయ్యప్పలకు అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు

సీతంపేట: శ్రీపూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక శంకరమఠం అయ్యప్ప దీక్షా పీఠంలో గురువారం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. అన్నదాన ప్రారంభ కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు, ట్రస్టు చైర్మన్ పైలా ఆది మోహన్‌రెడ్డి, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ రాజీవ్ కుమార్, అయ్యప్ప మహాసంగమం పూజా కోర్ కమిటీ చైర్మన్ ఎం.క్రిష్ణయ్య, ట్రస్టు అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ధర్మాల శ్రీనివాసరెడ్డి, టి. శ్రీనివాసరావు, ఎస్.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జనవరి 10 తేదీ వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం నిత్య అన్నదాన ప్రసాద వితరణ జరుగుతుందని, అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు ఏయూ గ్రౌండ్స్‌లో అయ్యప్ప మహా సంగమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నెల రోజుల పాటు అయ్యప్పలకు భిక్ష


సీతంపేటలో అయ్యప్ప స్వాములకు వడ్డన చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: శబరిగిరి పీఠం ఆధ్వర్యంలో సీతంపేట కనకమ్మవారి వీధిలో అయ్యప్ప స్వాములకు జరుగుతున్న అన్నదానం (భిక్ష) కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యులు సంపంగి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని అయ్యప్ప స్వాములకు వడ్డన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ చాలా నియమనిష్ఠలతో కూడుకున్నదని, నెల రోజుల పాటు అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చెయ్యడం అభినందనీయమని శబరిగిరి పీఠం ప్రతినిధులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి ఎల్.కె.రాజు, అన్నదాన ప్రధాన సేవకురాలు మాదాబత్తుల పాప, మాదాబత్తుల శ్రీనివాస్, కనకరత్నం, గురుస్వాములు, మాల ధరించిన అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార : ప్రేమ విఫలం కావడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఫోర్తు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అక్కయ్యపాలెం, జగన్నాథపురానికి చెందిన చుక్కా దుర్గాప్రసాద్‌రెడ్డి (19) డిగ్రీ రెండో సంవత్సరం వరకు చదివి మధ్యలో ఆపేశాడు. పూర్ణామార్కెట్‌కు చెందిన యువతిని ప్రేమించాడు. ఇరువురి మధ్య గొడవ జరగడంతో విడిపోయారు. అప్పటి నుంచి యువతి దూరమైందని దిగులుగా ఉండేవాడు. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఉమామహేశ్వరి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయకుమార్ ఆదేశాల మేరకు హెచ్‌సీ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌డీపీ తరగతులు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం ప్రారంభించారు. ఇంజినీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐడియా జనరేషన్ మెథడ్స్ అంశంపై మూడు రోజుల పాటు ఈ తరగతులు జరగనున్నాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకుల సామర్థ్యాలను పెంపొందించడానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఏయూ అనుబంధ కళాశాలలకు చెందిన 170 మంది అధ్యాపకులు హాజరయ్యారు.

దేశ సమైక్యతను దెబ్బ తీస్తున్న కేంద్రం


నిరసన ప్రదర్శన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మహిళలు


మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

మురళీనగర్: దేశ సమగ్రత, సమైక్యతను దెబ్బతీసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విశాఖ జిల్లా సమితి 11వ మహాసభ మురళీనగర్‌లోని వైశాఖి ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తోందని విమర్శించారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ధరలను తగ్గిస్తామని, విదేశాల్లో దాచి ఉంచిన నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి పౌరుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల మధ్య కులాలు, మతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ దేశ సమైక్యతకు, సార్వభౌమత్వానికి విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు రోజురోజుకీ పెంచుకుంటూ పోతున్నారన్నారు. వీటి ధరలు నిత్యావసర సరుకులపై ప్రభావం పడుతోందని, సామాన్యుడు బతుకు భారంగా మారిందని ధ్వజమెత్తారు. దేశ ఆర్థిక రంగానికి వెన్నెముకలాంటి ప్రభుత్వరంగ సంస్థలను, వనరులను కారు చౌకగా తన మిత్రులైన కార్పొరేట్ సంస్థల అధినేతలు అంబానీ, అదానీలకి కట్టబెడుతున్నారని విమర్శించారు. అంతకుముందు బిర్లా జంక్షన్ నుంచి సభాస్థలి వరకు మహిళలకు ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పతాకావిష్కరణ చేశారు. రోజురోజుకీ దేశవ్యాప్తంగా మహిళలపై పెరుగుతున్న లైంగికదాడులు, హత్యలు నివారణకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని, దోషులను శిక్షించడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని మహిళలు డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ మహాసభలలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య విశాఖ జిల్లా సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమితి అధ్యక్షురాలిగా కె.వనజాక్షి, ఉపాధ్యక్షులుగా ఎస్ అరుణ, దేవుడమ్మ , ప్రధాన కార్యదర్శిగా ఎండీ బేగం, సహాయ కార్యదర్శులుగా గాయత్రి, అన్నపూర్ణ, కోశాధికారిగా జి.జయలక్ష్మితో కలిపి 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమైక్య విశాఖ జిల్లా కార్యదర్శి ఎ.విమల, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


నాగిరెడ్డి (ఫైల్)

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో యువకుడు తప్పిపోయినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు... పై ఫొటోలో ఉన్న నాగిరెడ్డి అనే 19 ఏళ్ల యువకుడు సామర్లకోట వెళ్లేందుకు గత నెల 28వ తేదీన శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో 4వ నంబర్ ప్లాట్‌ఫాంపై తాగునీటి కోసం దిగాడు. అప్పటినుంచి యువకుడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు విశాఖ జీఆర్పీ సిబ్బందికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యువకుడు నీలం రంగు తెల్ల గడులు చొక్కా, నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడు. సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ కామేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు చామనఛాయరంగులో, సన్నగా ఉంటాడు. ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి 9493474582 / 94406 27547 నంబర్లలో తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ కామేష్ కోరారు.

యువతి కూడా..

మద్దిపాలెం: యువతి అదృశ్యంపై ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంచరపాలెం ఊర్వశి జంక్షన్ సమీపంలోని బర్మాక్యాంప్‌లో తోటాడ అప్పన్న భార్య, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. ఇంటర్ వరకు చదివిన ఈమె ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. గతనెల 31వ తేదీ రాత్రి 9.30 గంటల నుంచి కనిపించడం లేదని తండ్రి అప్పన్న గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ పర్యవేక్షణలో ఎస్ఐ జే.దివ్యభారతి దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీ క్రికెట్ లీగ్ ప్రారంభం


పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు


పాల్గొన్న క్రికెట్ జట్లు

సీతంపేట: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో ఆర్‌సీఎల్ –23 (రోటరీ క్రికెట్ లీగ్) పేరిట క్రికెట్ పోటీలు గురువారం అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రోటరీ సభ్యుల టీమ్స్ పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ జిల్లా క్రికెట్ అసోషియేషన్ ఉపాధ్యక్షులు డి.వర్మ , విశ్రాంత అదనపు ఎస్పీ టీఎస్సార్ ప్రసాద్, రోటరీ గవర్నర్ ఎలక్ట్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావులు పోటీలను ప్రారంభించారు. రోటరీ గవర్నర్ వేంకటేశ్వరరావు మాట్లాడుతూ రోటరీ సభ్యుల మధ్య స్నేహభావం పెంపొందించడానికి ఈ ఆర్‌సీఎల్ మంచి వేదిక అవుతుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈపోటీలో 8 టీమ్స్ తలపడనున్నాయని, పోర్టు స్టేడియం, రైల్వే గ్రౌండ్‌లో ఈనెల 5 వరకు మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రోవ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్ మొదిలి, పూర్వ అధ్యక్షులు సునీత లావణ్య, సెక్రటరీ రవి కిరణ్ ప్రసాద్, క్లబ్ డైరెక్టర్స్ సత్య, కె.వి.రెడ్డి, గంగాధర్, బైరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.


అవినీతి నిర్మూలనలో కీలక పాత్ర పోషించాలి

మద్దిలపాలెం : అవినీతి నిర్మూలనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు కోరారు. అవినీతి నిర్మూలన వారోత్సవాలను కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతలు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. అవినీతి రహిత సమాజా స్థాపనలో విద్యార్థుల పాత్ర కీలమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ఓరియంటెల్ ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు, రీజనల్ మేనేజర్ సతీష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏయూలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న 30వ జాతీయ లిక్విడ్ క్రిస్టల్స్ జాతీయ సదస్సును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ప్రారంభించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు సదస్సు కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయూ భౌతిక శాస్త్ర విభాగం సర్ సీవీ రామన్ నుంచి స్ఫూర్తిని పొందిందని, తరువాత కాలంలో ఆయన శిష్యులు ఆచార్య సూరి భగవంతం బలమైన పునాదులు నిర్మించారన్నారు. నేడు భారత్ అణుశక్తి, అంతరిక్ష, ఐవోటీ రంగాలలో అద్వితీయ ప్రగతిని సాధిస్తోందన్నారు. ఎల్‌సీడీల ఆవిష్కరణ తదనంతర మార్పులు వివరించారు. మూడు రోజుల సదస్సును పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ఆర్ఐ ఎమిరిటస్ ప్రొఫెసర్ కేఏ సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఏయూలో లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ రంగంలో పీసీ పతి చేసిన పరిశోధనలు, కృషిని వివరించారు. ఇండియన్ లిక్విడ్ క్రిస్టల్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య రవీంద్ర ధర్ మాట్లాడుతూ లిక్విడ్ క్రిస్టల్స్‌పై పరిశోధనలు దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా అందించే పలు అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాస రావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య కె.బసవయ్య, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.రామకృష్ణ నాంచారరావు ప్రసంగించారు. సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన పరిశోధకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీన్ ఆచార్య విజయ్‌మోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ నిషేధం, పర్యవసనాలు, చట్టాలపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన ప్రత్యేక పోస్టర్లను ఏయూ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎస్.వి జయ్‌మోహన్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నారు. వర్సిటీలోని వివిధ ప్రధాన కూడళ్ల వద్ద కూడా ర్యాగింగ్ నిషేధంపై ప్రత్యేక బోర్డులు తయారు చేసి ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, డాక్టర్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుము చెల్లించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, అనురాధ, ఎస్.సతీష్, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com